మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
# డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
శనివారం 14-03-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 144
Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను

తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును
8500066609

## నేటి నుంచి తెలంగాణ
# పదో తరగతి పరీక్షలు



- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

**హైదరాబాద్**
తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ -మిగతా 3 లో



## మంత్రి లోకేశ్‌తో బిట్స్
# ప్రతినిధుల భేటీ

- తొలి ఎఐ క్యాంపస్ కాలేజీగా బిట్స్ పిలాని
- క్యాంపస్ నిర్మాణ ప్లాన్‌లపై చర్చ
- వేయికోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడి

**అమరావతి, -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్‌గా ఉండబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఆ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు సైతం ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు వారు వివరించారు. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. బిట్స్ పిలానీ నిర్మాణ ప్లాన్లను మంత్రి నారా లోకేశ్ పరిశీలించారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి ప్లాన్లు చూపించారు. క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ కోర్సులు ఉంటాయని -మిగతా 3 లో



## కోమాలో ఇరాన్
# కొత్త సుప్రీం లీడర్?

- మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలు
- రెండు కాళ్లు కోల్పోయినట్లు సమాచారం.
- 'ది సన్' సంచలన కథనం!

**లండన్:**
ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన వార్తాపత్రిక 'ది సన్' పేర్కొంది. దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన ఒకటి లేదా రెండు కాళ్లను కోల్పోయినట్లు తెలిపింది. అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ కూడా ఈ వాదనకు మద్దతు ఇచ్చారు. దాడుల్లో తీవ్రంగా గాయపడిన మోజ్తాబా ముఖం కూడా వికృతంగా మారి ఉంటుందని ప్రెస్ బ్రీఫింగ్‌లో ఆయన అన్నారు.కాగా, ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీ కూడా ఈ దాడుల్లో లేదా ఆ తర్వాత జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడినట్లు బ్రిటీష్ టాబ్లాయిడ్ 'ది సన్' పేర్కొంది. టెహ్రాన్‌లోని సినా యూనివర్సిటీ ఆసుపత్రిలో గట్టి భద్రత మధ్య ఆయన చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. మరోవైపు మొజ్తబా ఖమేనీ చికిత్స గురించి ఒక ఇరాన్ నేత వివరాలు వెల్లడించినట్లు 'ది సన్' తెలిపింది. 'మా నాయుకుడు చాలా తీవ్రమైన స్థితిలో ఉన్నారు. ఒకటి లేదా రెండు కాళ్ళు
-మిగతా 3 లో

## అమరావతి నిర్మాణాలు
# మరింత వేగవంతం

### నిర్మాణ పనుల వేగంగా పూర్తికి అనుమతి

**రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు**

- చిన్నతరహా పరిశ్రమల ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి
- 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం
- 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణకు హాస్టళ్ల ఏర్పాటు
- ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం
- గ్యాస్ సరఫరాలో ఇబ్బందుఉల రాకుండా మంత్రుల పర్యవేక్షణ
- ఏపి కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు


**అమరావతి,-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన సచివాలయం, ప్రభుత్వ విభాగాధిపతుల టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానిలో తెలుగు సంస్కృతిని చాటిచెప్పేలా రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు పలు అంశాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
-మిగతా 3 లో



## ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ప్రశాంతంగా ముగిసాయన్న బోర్డు


3 లో




## కూలిన అమెరికా
# రీఫ్యూయలింగ్ విమానం

- ఇరాక్‌లో కూలినట్లు ప్రకటించిన అమెరికా
- తామే కూల్చామన్న ఇరాక్ రెబల్స్..తోసిపుచ్చిన అగ్రరాజ్యం

**వాషింగ్టన్**
అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. -మిగతా 3 లో

## అసోంలో రూ.4,500
# కోట్ల విలువైన ప్రాజెక్టులు



- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**గువాహటి,-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝూర్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ -మిగతా 3 లో

## నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

**అల్లూరు జిల్లా గిరిజనలతో నేడు పవన్ భేటీ**

**అమరావతి**
మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు వేడుకలకు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఏడాది పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని గిరిపుత్రుల మధ్య జరుపుకోవాలని పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించారు.

జనసేన

-మిగతా 3 లో

## దేశంలో గ్యాస్ కొరత లేదు

- ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు
- కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. -మిగతా 3 లో



## పాకిస్తాన్ ఆర్మీ సెంటర్లపై
# ఆఫ్ఘన్ దాడులు..

**తీవ్రరూపం దాల్చిన సరిహద్దు వివాదం:**



- ఒకరిపై ఒకరు బాంబుల వర్షం కురిపించుకుంటున్న పాక్, ఆఫ్ఘన్.
- పాకిస్తాన్ సైనిక కేంద్రాలపై ఆఫ్ఘన్ వైమానిక దాడులు: దెబ్బతిన్న ఆర్మీ స్థావరాలు!
- కోహట్ ఏరియాలోని వార్ కమాండ్ సెంటర్లే లక్ష్యంగా తాలిబన్ల దాడి.
- పాక్ గురువారం జరిపిన దాడులకు శుక్రవారమే బదులిచ్చిన ఆఫ్ఘనిస్తాన్.

**న్యూఢిల్లీ-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఒకపక్క ఇరాన్- ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం తీవ్రంగా కొనసాగుతుంటే మరోపక్క పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల ఇరుదేశాల మధ్య మొదలైన యుద్ధం ఇంకా కొనసాగుతోంది. గురువారం ఆఫ్ఘన్‌పై పాక్ దాడి చేస్తే.. శుక్రవారం పాకిస్తాన్‌పై ఆఫ్ఘన్ దాడి చేసింది. పాకిస్తాన్, ఖైబర్ -మిగతా 3 లో


## మూసీ ప్రక్షాళలను
# ఎప్పుడూ వ్యతిరేకించలే

- ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం
- మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం
- మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి
- పదేపదే బిజెపిని విమర్శించడం అపండి
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



**హైదరాబాద్, -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. -మిగతా 3 లో

# కొత్త పార్టీ పేరును ప్రకటించిన శశికళ




**చెన్నై: -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
తమిళనాడు దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే మాజీ జనరల్ సెక్రటరీ వీకే శశికళ(ఝుంఅఝ్ఘశ్రీఝ).. కొత్త పార్టీని స్థాపించారు. ఆ పార్టీకి ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేత్ర కజగం అని నామకరం చేశారు. ఏఐపీటీఎంఎంకే పేరును ఇవాళ ఆమె వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన రామనాథపురం జిల్లాలోని కాముతి లో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. కొబ్బరిచెట్ల ఫార్మ్‌ను పార్టీ బొమ్మగా ప్రకటించారు.ప్రస్తుతం శశికళ వయసు 71 ఏళ్లు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ సింబల్ ఐక్యతకు సంకేతం అని ఆమె అన్నారు. తమ పార్టీ ఓ ఉమ్మడి కుటుంబం తరహాలో పనిచేస్తుందన్నారు. తమిళనాడు, పుదుచ్చరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచేయనున్నట్లు ఆమె చెప్పారు. మన నాయకుడు ఎంజీ రామచంద్రన్ ఎదుర్కొన్న దశలోనే తాను కూడా ఉన్నానని, క్యాడర్ ప్రారంభించిన పార్టీలోనే ఆయన చేరారని ఆమె అన్నారు. తమ పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉన్నాయన్నారు. ఆ జెండాలో మాజీ సీఎంలు సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయలలిత ఫోటోలు కూడా ఉన్నాయి.

# ఇరాన్ పాఠశాల మృతుల కుటుంబాలకు చైనా సాయం



**బీజింగ్ :-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఇరాన్‌లోని ఒక పాఠశాలపై 'విచక్షణారహిత' క్షిపణి దాడిలో మరణించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సాయం అందించనున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది. ఇటీవల ఇరాన్ ప్రాథమిక పాఠశాలపై జరిగిన దాడిలో విద్యార్థులు మరణించడంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జియాకున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇరానియన్ రెడె క్రెసెంట్ సొసైటీకి చైనా రెడ్ క్రాస్ సొసైటీ అత్యవసర మానవతా సాయంగా 200,000 డాలర్లు (రూ.1.84కోట్లు) అందించాలని నిర్ణయించిందని అన్నారు. ఈ దాడిని అంతర్జాతీయ మానవీయ చట్టాన్ని 'తీవ్రమైన ఉల్లంఘన'గా అభివర్ణించారు. పాఠశాలలు, పిల్లలపై దాడులు "అంతర్జాతీయ మానవతా చట్టాన్ని మరింత తీవ్రంగా ఉల్లంఘించడం, మనస్సాక్షి మరియు నైతికత ప్రాథమిక లక్ష్యాన్ని ఉల్లంఘించడం" అని పేర్కొన్నారు.

# ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో!

**-భారీ ఎండలు, అకాల వర్షాలు**
**- వాతావరణ శాస్త్రవేత్తల అంచనా**




**న్యూఢిల్లీ, -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఈ ఏడాది భూగ్రహం అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినో దశలో ప్రవేశించవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇటీవలి దశాబ్దాల్లో ఇదే అత్యంత శక్తిమంతమైనదని వారు పేర్కొంటున్నారు. సూపర్ ఎల్‌నినోగా పేర్కొంటున్న ఈ దశ వచ్చే జూన్ నుంచి ప్రారంభం కావచ్చునని అంచనా వేస్తున్నారు. సూపర్ ఎల్‌నినో వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు మారవచ్చని, ఉష్ణోగ్రతలు భారీగా పెరగవచ్చని, రుతుపవనాలు అసాధారణంగా ఉండవచ్చని భావిస్తున్నారు.భూగ్రహం బలమైన లేదా సూపర్ ఎల్‌నినో దశను ఎదుర్కొనవచ్చని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కోస్ట్స్ నుంచి అందిన వివరాలు వెల్లడించాయి. కాగా, ఎల్‌నినో పరిస్థితులు ఎప్పుడు ఏర్పడినా ఆ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉంటున్నది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడం, వర్షపాతం తగ్గిపోవడం జరుగుతుంది. భారత్‌లో వేసవి అనంతర రుతుపవనాలు అధికంగా భూమి, సముద్రం మధ్య ఉండే ఉష్ణోగ్రతల మార్పులపై ఆధారపడి ఉంటాయి.

# గ్యాస్ కొరతతో పెరుగుతున్న సైబర్ నేరాలు..

**అప్‌డేట్ పేరుతో రూ.4 లక్షలు కోల్పోయిన ఇద్దరు మహిళలు**

**ముంబై-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
వంట గ్యాస్ కొరత నేపథ్యంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు అప్‌డేట్ పేరుతో ఇద్దరు మహిళలను మోసగించారు. వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.4 లక్షలు కొల్లగొట్టారు ఫిర్యాదులు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కల్యాణ్-డోంబివ్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. గ్యాస్ కొరత నేపథ్యంలో మహానగర్ గ్యాస్ లిమిటెడ్ డిస్ట్రిబ్యూటర్ సంస్థ ప్రతినిధుల పేరుతో వారికి ఫోన్ చేశారు. గ్యాస్



సిలిండర్ కనెక్షన్ సమాచారం అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. వారి మొబైల్ ఫోన్లకు ఏపీకే ఫైల్ పంపారు. దానిని డౌన్‌లోడ్ చేయించి ఓపెన్ చేయించారు. కాగా, ఒక ఫారమ్ పూరించాలని ఇద్దరు హిళలకు సైబర్ నేరగాళ్లు సూచించారు. వారు ఆ ప్రక్రియ పూర్తి చేయగా వారి బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ. 4 లక్షలు డెబిట్ అయ్యాయని మెసేజ్‌లు వచ్చాయి. మరోవైపు ఆందోళన చెందిన బాధిత మహిళలు డోంబివ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆన్‌లైన్ ఆర్థిక మోసాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి సుహాస్ హెమాడే తెలిపారు. ఇరాన్ యుద్ధం వల్ల దేశంలో నెలకొన్న గ్యాస్ కొరత నేపథ్యంలో ఇలాంటి ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. సైబర్ స్కామ్‌ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోరు!

**-సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
**-మహిళల ఉపాధికే ముప్పు ఏర్పడుతుందని వెల్లడి**



**న్యూఢిల్లీ, -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
అన్ని రంగాల్లో పనిచేసే మహిళలకు వేతనంతో కూడిన నెలసరి సెలవు కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదించి నెలసరి సెలవు విధానాన్ని రూపొందించడానికి పిటిషనర్ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల మహిళల ఉపాధిపై ఊహించని పరిణామాలు సంభవించ వచ్చని విచారణ సందర్భంగా కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది మహిళలను యాజమాన్యాలు నియమించుకోకుండా నిరుత్సాహపరచవచ్చని, తద్వారా వారు శ్రామికశక్తిలో పాల్గొనడంలో ప్రతికూల ప్రభావం చూపగలదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. పిటిషనర్ శైలేంద్ర మణి త్రిపాఠీ అర్హతలను ప్రశ్నించిన ధర్మాసనం ఈ విషయమై ఏ మహిళ కూడా కోర్టును ఆశ్రయించలేదని స్పష్టం చేసింది.

# సీఈసీ అభిశంసనకు నోటీస్.. పార్లమెంటులో విపక్షం అందజేత

**దేశ చరిత్రలో ఇదే మొదటిసారి**



**న్యూఢిల్లీ, -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ భారత ప్రధాన ఎన్నికల అధికారి అభిశంసన కోరుతూ భారత పార్లమెంటరీ చరిత్రలో తొలిసారిగా తీర్మానం నోటీస్‌ను పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాలు శుక్రవారం ప్రవేశపెట్టాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని డిమాండ్‌చేస్తూ లోక్‌సభ, రాజ్యసభలలో ఇండియా కూటమి ఎంపీలు శుక్రవారం నోటీసులు అందజేశారు.సామూహికంగా ఓటర్ల తొలగింపునకు పాల్పడుతూ పక్షపాత, వివక్షాపూరిత వైఖరికి పాల్పడుతున్నందున ఆయనను తొలగించాలని కోరుతున్నట్టు వారు తెలిపారు. ఏడు ప్రధాన ఆరోపణలతో ఉన్న 10 పేజీల ఈ నోటీస్‌పై 130 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ ఎంపీలు సంతకం చేశారు.

# టెహ్రాన్‌లో భారీ పేలుడు.

- వేలాది మంది హాజరైన ర్యాలీ వద్ద పెను విస్ఫోటం
-దాడి చేస్తామని ముందే హెచ్చరించిన ఇజ్రాయెల్
-అబ్రహం లింకన్ నౌకపై దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటన
-ఖండించిన అమెరికా.. ఇరాన్ లొంగిపోనున్నదన్న ట్రంప్


**న్యూఢిల్లీ,-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
రాజధాని టెహ్రాన్‌లో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. పాలస్తీనా పౌరులకు మద్దతు తెలియచేస్తూ, ఇజ్రాయెల్ అంతాన్ని కోరుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఖుద్స్ వార్షికోత్సవం కోసం వేలాదిమంది ఇరానీయులు శుక్రవారం హాజరైన ప్రదేశం వద్ద బాంబులు వేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఈ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎంతమంది మరణించిందీ వెంటనే



వివరాలు తెలియరాలేదు. అయితే ఇజ్రాయెల్ బాంబు దాడి హెచ్చరికలు, ఏదేమైనా తమ ప్రజా నిరసనలు కొనసాగించాలన్న ఇరాన్ నిర్ణయం ఇరు పక్షాల దృఢ సంకల్పాన్ని వెల్లడిస్తున్నాయి. టెహ్రాన్ సెంట్రల్‌లోని ఫిర్దోసీ చౌక్ వద్ద అమెరికా, ఇజ్రాయెల్‌కు మరణశిక్ష విధించాలని నినదిస్తూ వేలాదిమంది ఇరాన్ పౌరులు ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఇరాన్ న్యాయశాఖ అధిపతి గులాంహుస్సేన్ మొహసేని ఇజీ ఒక స్థానిక టెలివిజన్ విలేకరితో మాట్లాడుతూ ఈ క్షిపణుల వానకు ఇరాన్ భయపడదని చెప్పడం కనిపించింది. ఇజ్రాయెల్ జరిపిన ఈ దాడి దాని నిస్పృహను తెలియచేస్తుందని సీనియర్ భద్రతా అధికారి అలీ లారీజానీ ప్రకటించారు.

# బిర్యానీలో కుక్క కాలు.. వీడియో వైరల్

**లక్నో:-13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
ఒక వ్యక్తి ఆర్డర్ చేసిన బిర్యానీలో కుక్క కాలు కనిపించింది. కుక్క పాదం మాదిరిగా ఉన్న మటన్ పీస్‌ను ఆ వ్యక్తి చూపించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కామెంట్లు వెల్లువెత్తాయి. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన ఒక వ్యక్తి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోలో బిర్యానీ ఆర్డర్ చేశాడు. అయితే సగానికి పైగా తిన్న తర్వాత ఆ బిర్యానీలో కుక్క కాలు వంటిది కనిపించిందని అతడు తెలిపాడు. ఆ మాంసం ముక్కను జూమ్ చేసి



చూపించాడు. ఈ పీస్ చికెన్ లేదా మటన్ కాకుండా కుక్క పాదం, కాలి వేళ్లను పోలి ఉన్నదని ఆరోపించాడు. మిగిలిన బిర్యానీని కవర్‌లో పడేశాడు.కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆన్‌లైన్‌లో పెద్ద చర్చ జరుగడంతోపాటు కామెంట్లు వెల్లువెత్తాయి. అది 'కుక్క బిర్యానీ' అంటూ ఒకరు చమత్కరించారు. ఆ పీస్‌ను గుర్తించే ముందు ఆ వ్యక్తి సగం బిర్యానీ తిన్నట్లు మరొకరు గుర్తు చేశారు. మరోవైపు ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ తప్పులేదని కొందరు పేర్కొన్నారు. బిర్యానీ సప్లై చేసిన రెస్టారెంట్‌ను మరికొందరు నిందించారు. అయితే రోజు రోజుకు విస్తరిస్తున్న ఫుడ్ డెలివరీ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని చాలా మంది ప్రశ్నించారు.

# నేటి నుంచి తెలంగాణ
# పదో తరగతి పరీక్షలు

మొదటి తరువాయి

చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువు కోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. అందుకోసం తరగతి ఉపాధ్యాయులు లేదా, మంచి స్నేహితులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో చక్కటి వాతావరణం కల్పించాలి. విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ప్రతిక్షణం కృషి చేయాలి. అవసరమైన ధైర్యం అందివ్వాలి. పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు కనుక వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి సమయానుకూలంగా విద్యార్థికి తగిన పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సమయానికి తగినంత నిద్రపోయేలా కూడా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఇప్పటికే రెండు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాం. గణితం, సైన్స్, ఇంగ్లిష్ స్జబెక్ట్‌లలో మంచి మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మార్చి 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నాం అని అధికారులు వివరించారు.

## కోమాలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్?

మొదటి తరువాయి

తెగిపోయాయి. కాలేయం, కడుపు కూడా చీలిపోయింది. ఆయన స్పష్టంగా కోమాలో ఉన్నారు' అని ఆ ఇరాన్ నేత అన్నట్లు పేర్కొంది. ఇరాన్ ఆరోగ్య మంత్రి, యుద్ధ గాయాలకు చికిత్స చేసిన అనుభవం ఉన్న సీనియర్ సర్జన్, అనుభవజ్ఞుడైన ట్రామా సర్జన్ మొహమ్మద్ రెజా జఫర్ఘండి పర్యవేక్షణలో మొజ్తబా ఖమేనీకి చికిత్స కొనసాగుతున్నట్లు వార్తా కథనంలో పేర్కొంది. కాగా, సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ నుంచి ప్రత్యక్ష ఆదేశాలు లేకుండానే ఇరాన్ నాయకత్వ నిర్మాణం యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లు ఆ నేత స్పష్టం చేశారని 'ది సన్' తెలిపింది. చురుకైన నాయకుడు లేకుండా కూడా ఇరాన్ సైనిక కార్యకలాపాలు కొనసాగే వ్యవస్థను అయతుల్లా అలీ ఖమేనీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. 'ఆయన తండ్రి ఒక వ్యవస్థను వదిలి వెళ్ళాడు. ఒక దెయ్యం నడిపేలా అది ఉంది. అందుకే ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ఇప్పటికీ ఎగురుతున్నాయి. యుద్ధం ఇంకా కొనసాగుతున్నది' అని ఆయన అన్నట్లు 'ది సన్' పేర్కొంది. అయితే 'ది సన్' వార్తా కథనంపై ఇరాన్ స్పందించలేదు. పైగా కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తొలి సందేశం పేరుతో గురువారం ఒక ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని, హార్ముజ్ జలసంధిని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించినట్లుగా టీవీ వ్యాఖ్యాత దీనిని చదివి వినిపించారు.

## కూలిన అమెరికా రీఫ్యూయలింగ్ విమానం

మొదటి తరువాయి

శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్‌లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు. ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

# ముగిసిన ఇంటర్ పరీక్షలు

### ప్రశాంతంగా ముగిసాయన్న బోర్డు

**హైదరాబాద్,**

రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి వెల్లడించారు. నిరంతర నిఘా, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిఘాను పటిష్టంగా అమలు చేయడం, పరీక్ష కేంద్రాల తనిఖీల వల్ల మాల్ ప్రాక్టీస్ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. గత ఏడాది 2025లో రాష్ట్రవ్యాప్తంగా 115 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదవగా ఈ యేడాది 54 మాత్రమే కేసులు నమోదయ్యానట్లు వివరించారు. స్టేట్ అబ్జర్వర్లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు 10,426 కేంద్రాలను సందర్శించారని పేర్కొన్నారు. గత ఏడాది కంటే 1,876 కేంద్రాలను అధికంగా సందర్శించారని వివరించారు.

## నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

మొదటి తరువాయి

శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని నందిగరువు గ్రామంలో పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొంటారు. గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకుంటూనే, వారి మధ్యే పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నారు. తొలుత ఓనూరు జంక్షన్ వద్ద జనసేన జెండాను పవన్ కళ్యాణ్ ఆవిష్కరిస్తారు. అనంతరం 'పీఎం జన్ మన్' (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద నిర్మించిన రోడ్లను ఆయన స్వయంగా పరిశీలిస్తారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు నిర్మించిన 2.4 కి.మీ రహదారిని కాలి నడకన ప్రయాణిస్తూ పనుల నాణ్యతను తనిఖీ చేస్తారు. తర్వాత నిర్మాణం పూర్తయిన రహదారులను గిరిజనుల సమక్షంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నందిగరువు గ్రామ ప్రజలతో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు 'మాటా-మంతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పర్యటన చివరలో గిరిజనులతో కలిసి పవన్ కళ్యాణ్ మధ్యాహ్న భోజనం చేస్తారు. అధ్యక్షుడి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జనసైనికులు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# అమరావతి నిర్మాణాలు మరింత వేగవంతం

మొదటి తరువాయి

పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశర చేసింది. చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. దీనికోసం 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. మహిళా ఉద్యోగుల కోసం 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణ సౌకర్యాలు కలిగిన హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నారు. పోలీసు శాఖలో 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంఎ÷-లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలను చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన పనుల కోసం దాదాపు రూ.48 కోట్లను అదనంగా కేటాయించారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని, ఆ లోపు కాలువలు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం 'జలధార' కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టి, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్‌లో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు కేటాయింపు, పోలవరం ప్యాకేజ్-64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతి లభించింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు చేస్తూ ఆమోదించింది. క్యాబినెట్‌లో అజెండా అంశాలు ముగిసిన తర్వాత వివిధ అంశాలపై సీఎం చర్చించారు. గ్యాస్ కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు గ్యాస్‌కు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎలక్ట్రిక్ స్టవ్‌లతో విద్యుత్ డిమాండ్ పెరగడంతో పరిస్థితి పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరుపై నివేదికలు ఇస్తానని, వాటి ఆధారంగా సమీక్ష చేసుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపట్టాలన్నారు.

# మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ

మొదటి తరువాయి

ప్రతినిధులు వివరించారు. రెండు దశల్లో 7 వేల మందికి అవకాశం కల్పించేలా నిర్మాణాలు ఉంటాయన్నారు. క్యాంపస్‌పై ఐదేళ్లలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెడతామని ప్రతినిధులు మంత్రికి తెలిపారు. 'నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో క్యాంపస్ నిర్మిస్తున్నాం. గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ విధానాలు పాటిస్తున్నాం. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి బిట్స్.. దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్ కానుంది. వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్యం సంరక్షణ కోర్సులు ఉంటాయి' అని బిట్స్ ప్రతినిధులు లోకేశ్‌కు వివరించారు. సాధ్యమైనంత త్వరగా క్యాంపస్ ప్రారంభించేలా చూడాలని లోకేశ్ సూచించారు. ఈ సందర్భంగా బిట్స్ చేపట్టిన నిర్మాణ ప్లాన్లను లోకేశ్ పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వారిని మంత్రి లోకేశ్ కోరారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి




క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా అమరావతి బిట్స్ పిలాని నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ క్యాంపస్‌పై వచ్చే ఐదేళ్లలో రూ. 1000 కోట్ల పెట్టుబడి పెడతామని వారు ఈ సందర్భంగా వివరించారు. అలాగే సీఎం చంద్రబాబునాయుడు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నామని తెలిపారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమరావతి క్యాంపస్‌లో నిర్మించే భవనాల డిజైన్లను మంత్రి నారాయణకు వారు వివరించారు. రెండున్నరేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా మంత్రికి బిట్స్ ప్రతినిధులు తెలిపారు. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 70 ఎకరాల్లో బిట్స్ క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మూడు దశల్లో ం౧? క్యాంపస్‌గా బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేపట్టింది.

# మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే

మొదటి తరువాయి

మూసీ ప్రాజెక్టును కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విష్ణుశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్



ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విష్ణుశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు.

## పాకిస్తాన్ ఆర్మీ సెంటర్లపై ఆఫ్ఘన్ దాడులు..

మొదటి తరువాయి

పంక్తుంఖ్వాలోని ఆర్మీ కేంద్రాలపై శుక్రవారం వైమానిక దాడులు జరిపినట్లు ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది.ఈ దాడుల్లో పాకిస్తాన్‌కు ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని వెల్లడించింది. పాకిస్తాన్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులు చేసినట్లు తెలిపింది. పాకిస్తాన్ గురువారం రాత్రి ఆఫ్ఘన్‌లోని కొన్ని స్థావరాలపై దాడి చేసింది. ఆఫ్ఘన్ తీవ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్లు పాక్ తెలిపింది. ఈ దాడుల్లో సాధారణ పౌరులు మరణించినట్లు ఆఫ్ఘన్ తెలిపింది. దీంతో తాము కోహట్ ఏరియాలోని పాకిస్తాన్‌కు చెందిన కీలక స్తావరాలపై దాడి చేశామని తెలిపింది. దురంద్ లైన్ వద్ద వార్ కమాండ్ సెంటర్, ఫోర్ట్ కమాండర్లే లక్ష్యంగా ఈ దాడి చేశామని చెప్పింది. దాడుల ద్వారా ఇక్కడి నివాస ప్రాంతాల్ని కూడా ధ్వంసం చేసినట్లు ఆఫ్ఘన్ వివరించింది. తీవ్రవాద సమస్య కారణంగా పాక్, ఆఫ్ఘన్ పరస్పర దాడులకు దిగుతున్నాయి. తమ దేశంలోకి ఆఫ్ఘనిస్తాన్ తీవ్రవాదుల్ని పంపి విధ్వంసం సృష్టిస్తోందని పాక్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణల్ని ఆఫ్ఘన్ నేతలు ఖండిస్తున్నారు. పాక్‌లోని భద్రతా వైఫల్యం వల్లే ఆ దేశంలో దాడులు జరుగుతున్నాయని తెలిపింది. రెండు దేశాల మధ్య ఉన్న 2,600 కిలోమీటర్ల పొడవైన దురండ్ లైన్ వెంబడి ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. బ్రిటీష్ కాలం నాడు ఏర్పర్చిన ఈ సరిహద్దును ఆఫ్ఘన్ అంగీకరించడం లేదు. ఇలాంటి అనేక అంశాల్లో ఇరు దేశాల మధ్య విబేధాలున్నాయి.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

మొదటి తరువాయి

పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రి÷ఫ్ల÷నింగ్ కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్టిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్టిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు.

# సంపాదకీయం

### ఇరాన్ పట్ల భద్రతా

## మండలి పక్షపాతం!





గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలు మరియు జోర్డాన్‌పై ఇరాన్ దాడులను ఖండిస్తూ భారత్‌తో సహా 135దేశాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని బుధవారం నాడు 15 దేశాలతో కూడిన భద్రతామండలి 13-0 ఓటుతో ఆమోదించింది. రష్యా, చైనా ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఇరాన్ శృతిమించిన దాడులకు పాల్పడినట్లు తీర్మానంలో వర్ణించారు. వెంటనే అన్ని దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈ తీర్మానాన్ని ఇరాన్ పూచికపుల్ల మాదిరిగా తీసి వేస్తుందని వేరే చెప్పనవసరం లేదు. ఈ రోజు మమ్మల్ని ఖండించారు. నేడు మేము, రేపు మరొక సర్వసత్తాక దేశం అవుతుంది గనుక తీర్మానం వంటి పొరపాట్లు చేయవద్దని ఇరాన్ ప్రపంచ దేశాలను కోరింది. గల్ఫ్‌లోని తమ దీవులపై దాడులు చేస్తే పర్షియా జలసంధిలో రక్తపుటేరులు పారిస్తామని భద్రతా మండలి తీర్మానం తరువాత ఇరాన్ స్పీకర్ ప్రకటించాడు. అమెరికా దాడులు పదమూడవ రోజులో ప్రవేశించాయి. ఆ దాడులను ఖండిస్తూ ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ వెంటనే ఒక ప్రకటన చేయటం తప్ప భద్రతామండలి చేసిందేమీ లేదు. ఖండన తీర్మానం కూడా ఎవరూ పెట్టలేదంటే అమెరికా వీటోతో మురిగిపోతుందని తెలిసిందే.దాడులను బహిరంగంగా ఖండించిన చైనా, రష్యాలు ఎందుకు ప్రవేశపెట్టలేదు అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఆ దేశాల ప్రతినిధులు ఆ పని చేసినా దాన్ని వీటో చేసేందుకు అమెరికా, ఇతర దాని మిత్రదేశాలు సిద్ధం సుమతీ అన్నట్లుగా ఉంటాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు సమర్ధనీయం కాదని చైనా స్పష్టంగా చెప్పింది. మిలిటరీయేతర పౌర ప్రాంతాలపై దాడులు తగవని, ఉద్రిక్తతల నివారణకు పూనుకోవాలని కోరింది. రష్యా ఎలాంటి ప్రకటన చేయలేదు. చైనాకు ఇరాన్ ఎంత ముఖ్యమో గల్ఫ్ దేశాలూ అంతే. మన విషయానికి వస్తే ఇరాన్‌పై దాడిని ఖండించలేదు, తీర్మానం ద్వారా గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులను మాత్రం ఖండించింది. భద్రతా మండలిలో తీర్మానం ప్రవేశపెట్టబోయే ముందు మిత్రదేశమైన ఇరాన్‌తో తప్ప ఇతర మిత్రదేశాలన్నింటితో మన దేశం మాట్లాడింది. ఈ సందర్భంగా కొందరు పశ్చిమదేశాల వ్యాఖ్యాతలు అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ అమెరికా దాడులను ఖండించారు, అదే ప్రకటనలో ఇరాన్ ప్రతిదాడులు చేస్తున్నదని చెప్పటం వాటిని సమర్ధించటమే అని భాష్యం చెబుతున్నారు. తమపై శత్రువులు దాడులకు దిగితే హార్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేస్తామని, ఆ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలు ఎక్కడున్నా వాటిని వదలబోమని ఇరాన్ ఎప్పటి నుంచో చెబుతున్నది. తమ దేశాల్లో అమెరికా స్థావరాల ఏర్పాటుకు అంగీకరించిన గల్ఫ్ దేశాలు తమ గడ్డ మీద నుంచి ఇరాన్ మీద దాడులకు అనుమతించబోమని ప్రకటించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదేమో. అలాందిదేమీ లేదు, యుద్ధం ప్రారంభమైన తరువాత అమెరికా తన యుద్ధ విమానాలను సైప్రస్‌కు తరలించినట్లు వార్తలొచ్చాయి.అదే పని ముందే చేసి ఉన్నా గల్ఫ్ దేశాల మీద కచ్చితంగా ఇరాన్ దాడులు చేసి ఉండేది కాదు. ఆ దేశాల దోబూచులాటలు కూడా తాజా పరిణామాలకు కారణమన్నది స్పష్టం. తన పౌరనివాసాలపై, స్కూళ్లపై మాత్రమే గాక చమురు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన తరువాతే గల్ఫ్ దేశాల చమురు కేంద్రాల మీద ఇరాన్ దాడులకు దిగింది. యుద్ధంలో ఒకసారి ఒకరు నీతినియమాల గాడి తప్పిన తర్వాత మరొకరిని నిందించే నైతికహక్కు ఎవరికీ ఉండదు.ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేస్తామంటూ దాడులకు దిగిన అమెరికా-ఇజ్రాయిల్ చేసిందేమిటి? 19,734 పౌరనివాసాల మీద దాడులు , ఇప్పటి వరకు 1,348 మందిని చంపి, పదిహేడు వేల మందిని గాయపరిచారు. అరవై అయిదు స్కూళ్లు,77 వైద్య కేంద్రాలు దాడులకు గురయ్యాయి. ఇరాన్ ప్రతిదాడుల్లో కూడా అలాంటివేమైనా ఉన్నదీ లేనిదీ ఇంతవరకు ఏ దేశమూ ప్రకటించలేదు .ఇరాన్‌పై దాడులను స్వయంగా అమెరికా సాధారణ పౌరులే సమర్ధించటం లేదని తాజా సర్వేలన్నీ వెల్లడించాయి. మరోవైపు యుద్ధంలో గెలిచామని, అయినా దాడులను కొనసాగిస్తామని ట్రంప్ చెబుతున్నాడు.మరోవైపు అమెరికా గెలిచేదారిలో లేదని తనను తానే అపహాస్యం చేసుకుంటున్నదని అంతర్జాతీయ మీడియాలో కథనాలు ప్రారంభమయ్యాయి. యుద్ధ లక్ష్యాల గురించి ట్రంప్ చెప్పినట్లుగా తాను చెప్పినవారిని గాక కొత్త సుప్రీమ్ నేతను ఇరాన్ ఎన్నుకుంది, ఇంతవరకు అణుకేంద్రాలు చెక్కుచెదరలేదు, ఇతర మిలి టెంట్ గ్రూపులకు ఇరాన్ మద్దతు నిలిపివేయలేదు, అలాంటి వాటిలో ఒకటి హిజబుల్లా కూడా రంగంలోకి దిగింది. ఇజ్రాయిల్‌కు ముప్పు తప్పించారా అంటే లేదు. ఇలాంటి వాటిని చూపి అమెరికా గెలిచే దారిలో లేదని చెబుతున్నారు. హమాస్‌ను అణచేపేరుతో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన మారణహోమం, విధ్వంస కాండను చూసిన తర్వాత ప్రపంచ మిలిటరీ శక్తిగా ఉన్న అమెరికా తన ఆయుధాలతో ఇరాన్‌లో కూడా అదేపని చేయనుందన్నది స్పష్టం. ఎంత చేసినా పాలస్తీనియన్లకు ఇజ్రాయిల్ ఎలా లొంగదీసుకోలేదో ఇరానియన్లు కూడా అమెరికాకు తలవంచే అవకాశం లేదని చెప్పవచ్చు!

# మిస్సైల్ రక్షణ వ్యవస్థను దక్షిణ కొరియా నుంచి తరలిస్తున్న అమెరికా..

## దక్షిణ కొరియా అసంతృప్తి





**న్యూఢిల్లీ -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడుల నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. ఆ దేశాలపై ఇరాన్ దాడుల నుంచి రక్షణ కోసం చర్యలు ప్రారంభించింది. దీనిలో భాగంగా గల్ఫ్ దేశాలకు అమెరికా సిద్ధం చేసిన డిఫెన్స్ రక్షణ వ్యవస్థను తరలిస్తోంది. టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్ (టీహెచ్ఏఏడీ) మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ అని పిలిచే ఈ రక్షణ వ్యవస్థను అమెరికా.. గల్ఫ్ దేశాలకు తరలించడం ఇప్పుడు సంచలనంగా మారింది. కారణం.. ఈ వ్యవస్థ దక్షిణ కొరియాలో ఉండటమే.ఉత్తర కొరియాతో దక్షిణ కొరియాకు, అమెరికాకు ఉన్న శతృత్వం గురించి తెలిసిందే. అందుకే అటు దక్షిణ కొరియాకు అండగా ఉంటూనే, ఉత్తర కొరియాను ఎదుర్కొనేందుకు వీలవుతుందనే ఉద్దేశంతో అమెరికా.. దక్షిణ కొరియాలో టీహెచ్ఏఏడీ అనే మిస్సైల్ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయితే, ఇప్పుడు గల్ఫ్ దేశాలకు ఇరాన్ నుంచి రక్షణ కావాలి కాబట్టి.. ఈ సిస్టమ్‌ను చాలా వరకు మిడిల్ ఈస్ట్‌కు తరలిస్తోంది అమెరికా. ఇదే ఇప్పుడు దక్షిణ కొరియా అసంతృప్తికి కారణంగా నిలుస్తోంది. ఎందుకంటే ఈ వ్యవస్థ దక్షిణ కొరియా నుంచి వెళ్తే ఉత్తర కొరియా నుంచి వచ్చే మిస్సైళ్లను అడ్డుకోవడం కష్టమవుతుంది. ఈ దేశ భద్రత ప్రమాదంలో పడుతోంది. అందుకే అమెరికా నిర్ణయంపై ద.కొరియా అసంతృప్తి వ్యక్తమవుతోంది. అమెరికా ఆర్మీ బేస్‌ను, డిఫెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోనిచ్చినప్పుడే దక్షిణ కొరియా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఆ దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత అమెరికాదే. అలాంటిది ఇప్పుడు ఆ దేశ రక్షణకు ఉపయోగపడే టీహెచ్ఏఏడీని వేరే దేశాలకు తరలిస్తే తమ భద్రత ఎలా అని ద.కొరియా ఆందోళన చెందుతోంది. ద.కొరియాలో అమెరికాకు చెందిన ఆర్మీ బేస్ ఉంది. ఇక్కడ యూఎస్ అణ్వాయుధాలతోపాటు 28,500 మంది అమెరికన్ సైన్యం, సర్ఫేస్ టు ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వంటివి అమెరికా ఏర్పాటు చేసింది. అమెరికా నిర్ణయాన్ని ద.కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ వ్యతిరేకించారు. అయితే, ఇప్పుడు గల్ఫ్ మిషన్ పూర్తైన తర్వాత ఆ సిస్టమ్‌ను తిరిగి తమ దేశానికే తీసుకురావాలని ఆయన కోరుతున్నారు.అలాగే దేశ రక్షణ కోసం విదేశాలపై ఆధారపడకుండా సొంతంగా డిఫెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని అక్కడి వారు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో భారీ యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేస్తుంటే.. ఇరాన్.. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలు, టర్కీ వంటి ఇతర దేశాలపై కూడా దాడులు చేస్తోంది. అందుకే ఇరాన్ దాడుల్నుంచి తమ మిత్ర దేశాలైన గల్ఫ్ కంట్రీస్‌ను రక్షించేందుకు అమెరికా డిఫెన్స్ సిస్టమ్ తరలింపు నిర్ణయం తీసుకుంది.

# రాజస్థాన్‌లో ఫేక్ సర్టిఫికెట్లతో టీచర్ జాబ్స్

### - 19 మంది ఉపాధ్యాయులు సహా 20 మంది అరెస్టు




**జైపూర్ -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
: రాజస్థాన్‌లో నకిలీ అథ్లెట్ల సర్టిఫికెట్లతో టీచర్ ఉద్యోగాలు పొందిన కేసులో 20 మందిని అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాలతోపాటు హర్యానాలోని ఒక ప్రాంతం నుంచి ఈ 20 మందిని గురువారం రాజస్థాన్ పోలీసు శాఖకు చెందిన స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజి) అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో 19 మంది టీచర్లు కాగా, మరొకరు ఈ స్కామ్‌కు సహకరించిన విమలేందు కుమార్ ఝా. థర్డ్ గ్రేడ్ టీచర్స్ రిక్రూట్‌మెంట్ 2022 నియామకాల్లో ఈ స్కామ్ జరిగింది. నకిలీ తైక్వాండో సర్టిఫికెట్లు, వెరికేషన్‌లతో 'అవుట్‌స్టాండింగ్ అథ్లెట్' కోటా కింద 19 మంది అభ్యర్థులు టీచర్ ఉద్యోగాలను పొందారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను విద్యా శాఖ అధికారులు నిర్వహిస్తున్నప్పుడు ఈ స్కామ్‌ను గుర్తించారు. అభ్యర్థులు సమర్పించిన నకిలీ సర్టిఫికేట్లలో 'సెక్రటరీ' అనే పదం స్పెల్లింగ్ తప్పుగా ఉండటం అధికారుల్లో అనుమానాన్ని రేకెత్తించింది. మరింతగా దర్యాప్తు చేయగా తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియాతో ఎలాంటి సంబంధం లేని విమలేందు కుమార్ ఝా, అతని స్నేహితుడు రవి శర్మ.. ఆ సంస్థ పేరుతో నకిలీ ఇమెయిల్‌ను సృష్టించి ఈ సర్టిఫికేట్లు నిజమైనవే అని డైరెక్టరేట్ ఆఫ్ ప్రైమరీ ఎడ్యుకేషన్‌కు ధ్రువీకరణను పంపారు. ఈ నకిలీ సర్టిఫికెట్లను కొంతమంది బ్రోకర్ల ద్వారా అభ్యర్థులు కొనుగోలు చేశారు. ఈ స్కామ్‌లో మధ్యవర్తుల పాత్ర, వారికి చెల్లించిన మొత్తాలు, చెల్లింపు పద్ధతిని గుర్తించడానికి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# పార్లమెంటులో అనూహ్య ఘటన

### సిఇసిని తొలగించాలంటూ ఇండియా బ్లాక్ నోటీసు



**న్యూఢిల్లీ -13 మార్చి డ్రీమ్ టైమ్స్:**
పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌లో శుక్రవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలంటూ ప్రతిపక్షాల కూటమి 'ఇండియా బ్లాక్' పార్లమెంటులో నోటీసు సమర్పించింది. సిఇసిని తొలగించాలంటూ పార్లమెంటులో నోటీసు సమర్పించడం ఇదే మొదటిసారి. 130మంది లోక్‌సభ ఎంపిలు, 63మంది రాజ్యసభ ఎంపిలు ఈ నోటీసుపై సంతకం చేశారు. ఇండియా బ్లాక్‌లో ఆప్ లేనప్పటికీ .. ఈ బిల్లుపై ఆ పార్టీ ఎంపిలు సైతం సంతకం చేశారు. స్వతంత్ర ఎంపిలు కూడా సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నోటీసులో సిఇసిపై ఏడు అభియోగాలు పేర్కొన్నారు. 'విధుల్లో పక్షపాత మరియు వివక్షతతో కూడిన ప్రవర్తన', 'ఎన్నికల్లో మోసంపై దర్యాప్తును ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకోవడం', 'సామూహికంగా ఓటు హక్కును కోల్పోవడం' వంటివి నమోదు చేశారు. పాలక బిజెపికి సిఇసి అనేక సందర్భాల్లో సహాయం చేశారని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్‌పై మండిపడ్డాయి. ఇది కేంద్రంలోని అధికార పార్టీకి సహాయం చేయడమే లక్ష్యంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. జడ్జీల (విచారణ) చట్టం, 1968 ప్రకారం, పార్లమెంటు ఉభయ సభల్లో ఒకే రోజున తీర్మానానికి నోటీసులు ఇస్తే, తీర్మానానికి ఉభయ సభల్లో ఆమోదించకపోతే ఎటువంటి కమిటీని ఏర్పాటు చేయకూడదు. తీర్మానాన్ని రెండు సభల్లో ఆమోదించిన అనంతరం, స్పీకర్ మరియు చైర్మన్ సంయుక్తంగా కమిటీని నియమించాల్సి వుంటుంది.

**అప్రాప్రియేషన్ బిల్లు -2026 ఆమోదం**
ప్రపంచ ప్రతికూలతలను ఎదుర్కొనేందుకు దేశానికి ఆర్థిక సహాయం అందించడానికి భారతదేశం 'ఆర్థికస్థిరీకరణనిధి' ని ప్రతిపాదించిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంటుకు తెలిపారు. ప్రతిపక్షాల నిరసనలతో పదేపదే వాయిదా పడిన అనంతరం లోక్‌సభ అప్రాప్రియేషన్ బిల్లు, 2026 (వినియోగాధికారమిచ్చే బిల్లు)ని ఆమోదించింది. 2025-26 ఆర్థిక సంవత్సర సేవల కోసం భారత సంఘటిత నిధి నుండి కొన్ని అదనపు మొత్తాలను చెల్లించడానికి మరియు కేటాయించడానికి ఈ బిల్లు అధికారమిస్తుంది. గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్‌ను లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.లక్ష కోట్ల ఆర్థిక స్థిరీకరణనిధిగా వెల్లడించారు. ఇది "ప్రపంచ ప్రతికూలతలను ఎదుర్కోవడానికి భారతదేశం ఆర్థికంగా ముందంజ వేయడానికి వీలు కల్పిస్తుంది" అని పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం





-మంత్రి ఎన్ఎండి ఫరూక్
- బిల్లలాపురంలో ఘనంగా అన్నదాత సుఖీభవ
-పీఎం కిసాన్ నిధుల పంపిణీ
-ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి




**నంద్యాల ప్రతినిధి, మార్చి 13 (డ్రీమ్ టైమ్స్)**
కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతు కుటుంబానికి 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎం కిసాన్ నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను జోడించి రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. నంద్యాల మండలం బిల్లాపురం గ్రామంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'అన్నదాత సుఖీభవ -- పి.ఎం కిసాన్' పథకం మూడవ విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతికి తావులేకుండా పారదర్శక పద్ధతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకే ఈ నగదు జమ అవుతుందని తెలిపారు. వ్యవసాయ పనులు మొదలయ్యే సమయానికి ఈ నిధులు అందడం వల్ల రైతులు అప్పుల బారిన పడకుండా తమ అవసరాలను తీర్చుకోగలుగుతారన్నారు. సాగునీరు, ఎరువులు, విత్తనాల సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని, నంద్యాల జిల్లాను వ్యవసాయ రంగంలో మేటిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాకుమారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం అందేలా జిల్లా యంత్రాంగం పారదర్శకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో బిల్లాపురం గ్రామ టీడీపీ ఇంచార్జి చిలకల చిన్నయ్య, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ కుమార్, గౌడ్, కన్నాయోహన్, రామకృష్ణారెడ్డి, రంగ ప్రసాద్, పుల్లయ్య, మునగాల విశ్వనాథ్ రెడ్డి, తులసీశ్వర్ రెడ్డి, బుగ్గ రాముడు, ఇమ్మడి శ్రీనివాసులు, బాలరాజు, బోప్ప బాలుడు, రాజగోపాల్ స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, బిల్లాపురం గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజనగరం హైస్కూల్లో ఘనంగా సరస్వతి పూజ, వీడ్కోలు సభ

-వివిధ పరిమళ పుష్పాలతో సరస్వతి దేవి అలంకరణ
-వివిధ సంస్కృతిక కార్యక్రమాల్లో సందడి చేసిన విద్యార్థిని విద్యార్థులు.



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని రాజనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సరస్వతి పూజ, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.వివిధ పరిమళ పుష్పాలతో సరస్వతి దేవి విగ్రహాన్ని అందంగా అలకరించి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దృష్టిలో పెట్టుకొని నిర్వహించిన చదువుల తల్లి శ్రీ శ్రీ సరస్వతీ దేవిపూజా కార్యక్రమంలో భాగంగా రాజనగరంహైస్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిని విద్యార్థులతో హెచ్ఎం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని వారికి ధైర్యం నింపారు. ఉన్నత విద్యాభ్యాసానికి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ పూజ చేయడం వల్ల సరస్వతి కటాక్షం లభించి చదువు, జ్ఞానం అందరికీ సరస్వతి దేవి అనుగ్రహం ఉంటుందన్నారు. కష్టపడి చదివి మంచి మార్కులతో మీ తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో, పాఠశాల చైర్మన్ బుట్టి జయలక్ష్మి , కోలాటం గురువు గురు ప్రసాద్ ,హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు, మరియుగ్రామస్తులు పాల్గొన్నారు.

# మంత్రికి వినతిపత్రం అందజేసిన టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు






**నంద్యాల ప్రతినిధి, మార్చి 13 (డ్రీమ్ టైమ్స్):**
నంద్యాల పట్టణంలోని రాయలసీమ టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టైలర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అసోసియేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నంద్యాల పట్టణంలో సుమారు 2వేలకు పైగా కుటుంబాలు ప్రత్యక్షంగా టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, ఏడాది పొడవునా ఉండే పని కంటే రంజాన్, ఉగాది వంటి పండుగల సమయంలోనే టైలర్లకు చేతినిండా పని దొరుకుతుందని తెలిపారు. ఈ ఆదాయమే అనేక కుటుంబాలకు ఏడాది పొడవునా జీవనాధారమని, రెండవ శనివారం లేదా ఇతర రోజుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తే మిషన్లు ఆగడం వల్ల పనులు సకాలంలో పూర్తికాక టైలర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. టైలర్ల జీవనోపాధిని పరిగణనలోకి తీసుకుని విద్యుత్ శాఖ ద్వారా చేపట్టే నిర్వహణ పనులను వచ్చే వారానికి వాయిదా వేసేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. టైలర్ల సమస్యలపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా రాయలసీమ టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె. శేఖర్ (ప్రభు టైలర్స్), 11 వ వార్డ్ టీడీపీ ఇంచార్జి అఫ్జల్ బాషా , టౌన్ అధ్యక్షులు కె.ఎం బాషా (వీనస్ టైలర్స్), గౌరవ సలహాదారుడు జమాల్ బాషా, అసోసియేషన్ సభ్యులు మహబూబ్ బాషా, సురేష్, రవి, ప్రసాద్, అబ్దుల్లా ఆనంద్ , అల్లా ప్రకాష్ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్సీఎం శ్మశానవాటిక స్థలం పరిశీలన





**నంద్యాల ప్రతినిధి, మార్చి 13 (డ్రీమ్ టైమ్స్)**
నంద్యాల పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ షెడ్ రోడ్డులో ఉన్న ఆరోగ్య మాత పుణ్యక్షేత్రానికి (ఆర్సీఎం చర్చి) సంబంధించిన స్మశాన వాటికను మునిసిపల్, రైల్వే అధికారులు శుక్రవారం పరిశీలించారు. రెండు వారాల క్రితం ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం, నూనెపల్లి ఆర్సీఎం చర్చికి సంబంధించిన స్మశాన వాటిక స్థలం సమస్యపై సంఘ పెద్దలు రెండవ తేదీన స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిశీలించి నివేదిక ఇవ్వాలంటూ స్థానిక మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు గూడ్స్ షెడ్ రోడ్డులో నాగుల కట్ట సమీపంలో ఆర్.సి.యం చర్చి సంఘం వినియోగించుకుంటున్న స్మశాన వాటికను టౌన్ ప్లానింగ్ అధికారులు, రైల్వే అధికారులు, ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కె. దేవస్య జోసెఫ్ లు సంఘ పెద్దలతో కలిసి పరిశీలించారు. సమస్యపై చర్చి పరిధిలోని ఆయా సంఘాల ఉపదేశులు బాలస్వామి, రవి, జోజిలతోపాటు ఎమ్మార్పీఎస్ నాయకుడు రవి, మహిళా సంఘం నాయకురాలు నందిని, సంఘ పెద్దలు మార్కు, అంబయ్య, ఓబులేసు, సంఘస్తులు కలిసి సంబంధిత అధికారులకు వివరించారు. స్మశాన వాటిక స్థల సమస్యను పరిష్కరించాలని వారు అధికారులు కోరారు.

# చిట్వేల్‌లో బాలికలకు హెచ్‌పీవీ టీకా

-సర్వైకల్ క్యాన్సర్ నివారణకు కీలక చర్య



**చిట్వేల్, మార్చి 13 ట్రైన్ టైమ్స్**
బాలికలను సర్వైకల్ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధి నుంచి రక్షించేందుకు చిట్వేల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ప్రారంభించారు. వైద్యులు డా. ఎం. శివప్రసాద్ గౌడ్ పర్యవేక్షణలో డా. సల్మా మేడం బాలికలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాల బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో విల్లింగ్ లెటర్ తీసుకొని హెచ్‌పీవీ టీకాలను అందించారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికలు భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందగలరని వైద్యులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిట్వేల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ఈ టీకాలను డా. శివప్రసాద్ గౌడ్ పర్యవేక్షణలో స్టాఫ్ నర్సుల ద్వారా వేయబడతాయని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ టీకా వేయించుకుంటే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ టీకా అందుబాటులో ఉండటం తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. శివప్రసాద్ గౌడ్, డా. సల్మా, స్టాఫ్ నర్సులు రజని, తేజోవతి, ఎంఫిహెచ్ఈఓ విజయకుమార్, ధనలక్ష్మి, పిహెచ్ఎన్ విజయకుమారి, హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ బాషా, ఫార్మసిస్ట్ సుమలత, ఎంఎల్‌హెచ్‌పీ కల్పన, సాయిలీల, రుఖియాబాను, ఏఎన్ఎం కృష్ణవేణి, గౌరీ, ఆశా కార్యకర్తలు మరియు బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇష్టపడి చదివితే విజయం మీదే



**బనగానపల్లె, మార్చి 13 (డ్రీమ్ టైమ్స్)**
ఇష్టపడి చదివితే విజయం సాధించవచ్చు అని టిడిపి నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బీసీ ఇందిరా రెడ్డి పరీక్ష ప్యాడులను పంపిణీ చేశారు. పాఠశాలలో బీసీ ఇందిరా రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సరస్వతి పూజను నిర్వహించారు. ఒత్తిడిని జయించి ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే విజయం మీదే అన్నారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం పాల్గొన్నారు.

# బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి






**నంద్యాల ప్రతినిధి, మార్చి 13 (డ్రీమ్ టైమ్స్):**
బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, అనుమానాస్పద ఘటనలు తమ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలో మహిళలపై జరిగే నేరాలు, శక్తి యాప్, వన్ స్టాప్ సెంటర్ ప్రాముఖ్యత, వాటి ప్రయోజనాలపై బాలికలు, మహిళలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గడివేముల మండలం కరిమద్దుల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.


# చిట్వేల్‌లో ఇండేన్ గ్యాస్ గోదాం పై ఆకస్మిక తనిఖీ

-భద్రతా ప్రమాణాల పరిశీలన
-- సమయానికి సరఫరా చేయాలని తహసీల్దార్ సూచన




**చిట్వేల్ మార్చి13 డ్రీమ్ టైమ్స్**
చిట్వేల్ మండల పరిధిలోని ఇండేన్ గ్యాస్ గోదాంను తహసీల్దార్ శ్రీమతి పి. స్పందన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్ల భద్రతా ప్రమాణాలు, నిల్వ విధానం మరియు అగ్నిప్రమాద నివారణ చర్యలను సమగ్రంగా పరిశీలించారు. గోదాంలో ప్రస్తుతం ఉన్న సిలిండర్ల స్టాక్ వివరాలు, పెండింగ్ బుకింగ్స్, రాబోయే డెలివరీల వివరాలను కూడా గోదాం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల నిల్వ, పంపిణీ ప్రక్రియలో ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్లను సమయానికి సరఫరా చేయాలని గోదాం సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యు. నిఖిల్ కుమార్, చిట్వేల్ వీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలక్షేత్రానికి.. తెలంగాణ రాష్ట్ర గవర్నర్..



**శ్రీశైలం మార్చి13 డ్రీమ్ టైమ్స్**
శ్రీశైలభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం రాత్రి శ్రీశైలం చేరుకున్నారు. దర్శనార్దమై శ్రీశైలం చేరుకున్న గవర్నర్ కు భ్రమరాంబా అతిధి గృహం వద్ద కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు స్వాగతం పలికారు. గవర్నర్ శనివారం ఉదయం స్వామివార్ల ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని ఆలయ అధికారులు తెలిపారు. గవర్నర్ శ్రీశైలం పర్యటన సందర్భంగా పటిష్టమైన భద్రత కల్పించారు.

# వార్ వర్రీ

- చిట్వేల్‌లో ఇంధనం కొరత
- డీజిల్ పెట్రోల్ కోసం వాహనదారుల పరుగులు



**చిట్వేల్, మార్చి13 డ్రీప్ టైమ్స్:**
ఎక్కడో ఇరాన్ పై జరుగుతున్న వార్ తో చిట్వేలి ప్రజలు వర్రీ అవుతున్నారు. కారణం ఇంధనం. డీజిల్ పెట్రోలు లేకుండా వాహనాలు నడవకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మూడు రోజులుగా చిట్వేలి లోని పెట్రోల్ బంకులు నో స్టాక్ బోర్డు పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న యుద్ధ పరిణామాల ప్రభావం నేపథ్యంలో చిట్వేల్ పట్టణంలో పెట్రోల్ బంకుల వద్ద అసాధారణ రద్దీ నెలకొంది. భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ సరఫరా తగ్గిపోతుందేమో... ధరలు ఒక్కసారిగా పెరుగుతాయేమో అన్న ఆందోళనతో ప్రజలు ముందస్తుగా ఇంధనం నింపించుకుంటున్నారు. దీంతో పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద ఉదయం నుంచే వాహనాల క్యూలు కనిపిస్తున్నాయి.

**నాలుగు బంకుల వద్ద భారీ క్యూలు**
చిట్వేల్ పట్టణంలో ఉన్న నాలుగు పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు పెద్ద ఎత్తున చేరుతున్నారు. రెండు చక్రాల వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వరుసగా నిలబడడంతో కొన్నిచోట్ల రహదారులపై ట్రాఫిక్‌కు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పెట్రోల్ వచ్చినట్లు సమాచారం అందగానే ఒక్కసారిగా వాహనాలు బంకుల వైపు చేరడంతో పరిస్థితి మరింత రద్దీగా మారుతోంది.
ట్యాంకులు నిండా... అదనంగా కేన్లలో కూడా నిల్వ
యుద్ధం ప్రభావంతో భవిష్యత్తులో ఇంధనం కొరత ఏర్పడుతుందనే భయంతో కొంతమంది వాహనదారులు తమ వాహనాల ట్యాంకులను పూర్తిగా నింపించుకుంటున్నారు. అంతేకాకుండా అదనంగా బాటిళ్లు, ప్లాస్టిక్ కేన్లలో కూడా పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వల్ల బంకుల్లో ఇంధనం త్వరగా ఖాళీ అవుతోంది.

**ఖాళీ బంకులు చూసి ప్రజల్లో మరింత ఆందోళన**
కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం త్వరగా అయిపోవడంతో తాత్కాలికంగా బంకులు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఆ దృశ్యాలు చూసిన ప్రజల్లో మరింత భయం నెలకొంటోంది. నిజంగానే పెట్రోల్ కొరత వస్తుందేమో... ధరలు పెరుగుతాయేమో అన్న అనుమానాలతో వాహనదారులు మరింతగా ఇంధనం నింపించుకోవడానికి పరుగులు తీస్తున్నారు.

**ఆందోళన అవసరం లేదంటున్న నిర్వాహకులు**
ఇదిలా ఉండగా పెట్రోల్ బంకు నిర్వాహకులు మాత్రం ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. సాధారణంగా ఇంధన సరఫరా కొనసాగుతూనే ఉందని, భయంతో ఒక్కసారిగా ఎక్కువగా కొనుగోలు చేయడం వల్లే తాత్కాలికంగా కొరతలా కనిపిస్తోందని వారు తెలిపారు.

**అపోహలకు లోనుకాకూడదంటున్న అధికారులు**
అధికారులు కూడా ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరానికి తగ్గట్టే ఇంధనం వినియోగించాలని సూచిస్తున్నారు. అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలగొచ్చని పేర్కొన్నారు. పరిస్థితి సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

# జిల్లాలో గ్యాస్ సరఫరా సమీక్ష


కొరత లేదని కలెక్టర్ స్పష్టం




**కరీంనగర్, - మార్చి13 డ్రీప్ టైమ్స్:**
జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. సరిపడా నిల్వలు ఉన్నాయని, యధావిధిగా సరఫరా జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు, సివిల్ సప్లై, రవాణా, విద్య, ఆరోగ్య శాఖల అధికారులతో గ్యాస్ సరఫరాపై సమీక్ష నిర్వహించారు. హాస్టల్స్, గురుకులాలు, ఆసుపత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో గ్యాస్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే కమర్షియల్‌గా వాడుతున్న 39 డొమెస్టిక్ సిలిండర్లను అధికారులు సీజ్ చేసి, 15 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కోసం డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, సివిల్ సప్లై ఆఫీసర్ కన్వీనర్‌గా 12 మంది అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారని చెప్పారు.గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తితే ప్రజలు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 9154249727లో సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, సివిల్ సప్లై ఆఫీసర్ నర్సింగారావు, డిసిపి వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్ల ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మ రాధాకిషన్, హరికృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో వివాహ వార్షికోత్సవ సంస్కారం

**దేవరకొండ మార్చి13 డ్రీప్ టైమ్స్:**
హిందువులు ఆచరించే ప్రతి పూజలో యజ్ఞ యాగాలలో ఆరోగ్యం,ఆనందం, సత్ప్రవర్తన దాగి ఉందని వింజమూరు చంద్రమౌళి అన్నారు. హైదరాబాద్ రోడ్డులోని ఎస్వీ కాంప్లెక్స్ లో గల ప్రజ్ఞాపీఠ్ వద్ద అఖిల విశ్వ గాయత్రి పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్ వారు కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన దాచేపల్లి వసంత వెంకటేశ్వర్లు వివాహ వార్షికోత్సవ సంస్కారాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు కుండీల గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలు పోకుండా మన హిందూ సంప్రదాయం ప్రకారం జన్మదిన సంస్కారం, వివాహ సంస్కారం నిర్వహించుకోవాలన్నారు . హిందూ సంప్రదాయంలో నిర్వహించే ప్రతి పూజలో ఆరోగ్యం దాగి ఉందన్నారు. భార్య భర్తలు రెండు శరీరాలు ఒకే ప్రాణమై జీవించాలన్నారు. భార్యతో భర్త సత్ప్రవర్తనతో అభిప్రాయ బేదాలను, పొరపాట్లను శాంతితో పరిష్కరిస్తానని ఎవరి ఎదుట భార్యను అవమానపరచనని ప్రతిజ్ఞ చేయించాడు. అలాగే భార్య కూడా భర్తకు అనుకూలవతియై ఉండాలని స్వచ్ఛమైన ప్రేమానురాగాలు గల సద్గునురాలై భర్తకు కుటుంబ సభ్యులకు సేవ చేసే గుణం కలిగి ఉండాలన్నారు. దంపతులకు పూలమాలలు వేయించి యజ్ఞం చేయించి రెండు దీపాలను ఒకటిగా వెలిగించి పుష్పాలతో ఆశీర్వదించారు.మాతా గాయత్రీ దేవి, భగవాన్ పండిత శ్రీ రామ శర్మ ఆచార్య, భగవతీదేవి శర్మ ల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందని ఆశీర్వదించారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మారం వెంకన్న ప్రసన్న,వాసు, ఏరుకొండ రాము, యాద వరలక్ష్మి ధనుంజయ, దుండిగళ్ల వెంకటేశ్వర్లు,నడ్డి శంకర్, గాజుల వాణి, మంజుల, కృష్ణ, వేణు, నాగార్జున రెడ్డి,కొప్పెర చంద్రమౌళి, గిరి, నాగమణి, నందిని తదితరులు పాల్గొన్నారు.







# బిజినెస్

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు.. సెన్సెక్స్ 1,470, నిఫ్టీ 488 పాయింట్లు నష్టం



: భారత మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. మధ్యాహ్నం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 1470 పాయింట్లు నష్టపోయింది. దీంతో 74,563.92 పాయింట్ల ముగిసింది. నిఫ్టీ కూడా 488 పాయింట్లు నష్టపోయింది. 23,151.10 వద్ద ముగిసింది. ఉదయం 75,450 పాయింట్ల వద్ద బీఎస్ఈ సెన్సెక్స్ ప్రారంభమైంది. తర్వాత 600 పాయింట్ల వరకు పడిపోయింది. తర్వాత మరింత నష్టపోయింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ ఉదయం 150 పాయింట్ల నష్టంతో 23,450 వద్ద ప్రారంభమైంది. అనంతరం నిఫ్టీ కూడా భారీగా పడిపోయింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ చమురు ధరలు 0.49 శాతం పెరిగి 101 డాలర్లకు చేరింది. ఇండియాతోపాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా నష్టాల బాటలోనే సాగాయి. దక్షిణ కొరియా బెంచ్‌మార్క్ కాస్పి, జపాన్ నిక్కే 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ అన్నీ నష్టాలే చవిచూశాయి. గురువారంతో పోలిస్తే అమెరికాకు చెందిన వాల్ స్ట్రీట్ మార్కెట్ స్వల్ప నష్టాలు చవిచూసింది. విదేశీ మదుపర్లు అమ్మకాలకు పాల్పడితే, దేశీయ పెట్టుబడిదారులు కొనుగోళ్లపై దృష్టిపెట్టారు. ఫారిన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ (ఎఫ్ఐఐలు) రూ.7,049.87 కోట్ల విలువైన షేర్లను అమ్మగా, డొమెస్టిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ (డీఐఐలు) కొన్నాయి. ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటివరకు సెన్సెక్స్ 6,147 పాయింట్లు నష్టపోయింది. ఫిబ్రవరి 27న సెన్సెక్స్ 81,287 పాయింట్ల వద్ద ఉండగా, ఇప్పుడు 75,000 దిగువకు పడిపోయింది. మొత్తంగా రెండు వారాల్లోనే 7.5 శాతం పతనమైంది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ బాగా పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 92.467 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు రోజు ఇది 92.19 వద్ద ముగిసింది. మిడిల్ ఈస్ట్ యుద్ధం, చమురు సంక్షోభం, ధరల పెరుగుదల వంటివి నేటి మార్కెట్ పతనానికి కారణాలుగా చెబుతున్నారు విశ్లేషకులు.

## కుప్పకూలుతున్న బంగారం, వెండి ధరలు.. ఆశ్చర్యపోతున్న బులియన్ మార్కెట్ నిపుణులు!

బంగారం, వెండి ధరల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కసారిగా పెరుగుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. గత రెండు రోజులుగా ధరలు పతనమవుతున్నాయి. భారీ స్థాయిలో తగ్గింపు ఉంటుంది. అయితే తాజాగా మార్చి 13వ తేదీన దేశంలో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం దేశీయంగా తులం బంగారం ధర రూ.1,62,210 వద్ద కొనసాగుతుండగా, వెండి ధర రూ.2,79,900 వద్ద కొనసాగుతోంది.



**ప్రధాన నగరాల్లో ధరల వివరాలు:**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,210 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,690 వద్ద కొనసాగుతోంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,210 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,690 వద్ద కొనసాగుతోంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,360 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,840 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,210 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,690 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,63,300 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,49,690 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,210 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,690 వద్ద కొనసాగుతోంది.

కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,210 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,690 వద్ద కొనసాగుతోంది.

కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,210 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,690 వద్ద కొనసాగుతోంది.

హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,89,900 ఉండగా, ఇతర నగరాల్లో ఇంకా తక్కువగా ఉంది. రూ.2,79,900 మాత్రమే ఉంది.

## టీవీఎస్ నయా ఈ-స్కూటర్

### సింగిల్ చార్జింగ్‌తో 84 కిలోమీటర్లు

**చెన్నై,**


ఈవీ పరిధిని మరింత విస్తరించడంలో భాగంగా టీవీఎస్ మోటర్ కంపెనీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఆర్బిటర్ వీ1ను 1.8 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన సంస్థ..ఆర్బిటర్ వీ2ని 3.1 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 86 కిలోమీటర్లు ప్రయాణించనున్న ఈ మాడల్ ప్రారంభ ధర రూ.49,999గా(బ్యాటరీ-య్యాస్-



ఏ-సర్వీసెస్(బాస్)తో కలుపుకొని నిర్ణయించింది. బాస్‌తో నెలవారీగా రూ.862 చెల్లించాల్సివుంటుంది.2.20 గంటల్లో బ్యాటరీ 80 శాతం రీచార్జి కానున్నది. బాస్ లేకుండా ఈ స్కూటర్ ధరను రూ.84,500కి విక్రయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. మొబైల్ యాప్‌తో బ్యాటరీ చార్జింగ్ తెలుసుకోవచ్చును. స్మార్ట్ నావిగేషన్‌తో కాల్స్ అటెండ్ కావడంతోపాటు ఎస్ఎంఎస్ పంపుకోవచ్చు కూడా. ఈ స్కూటర్‌పై ఐదేండ్లు లేదా 70 వేల కిలోమీటర్ల వ్యారెంటీని కల్పిస్తున్నది.

## కావ్య మారన్‌పై నెటిజన్ల ఆగ్రహం.. ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ సన్‌రైజర్స్'..!

ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ పై నెటిజన్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. విదేశీ లీగే అయినప్పటికీ శత్రుదేశం ఆటగాడిని కొన్నందుకు ఆమెపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఫలితంగా బాయ్‌కాట్ సన్‌రైజర్స్ హ్యాష్‌ట్యాగ్ నెట్టింట ట్రెండ్ అవుతోంది. ది హండ్రెడ్ లీగ్ వేలంలో పాకిస్థాన్ క్రికెటర్ అబ్రార్ అహ్మద్ ను సన్‌రైజర్స్ లీడ్స్ కొనడమే దీనికంతటికి కారణం.భారత ఫ్రాంచైజీలు పాకిస్థాన్ ఆటగాళ్లను కొనడం మానేసి చాలా రోజులైంది. ఐపీఎల్ ఆరంభంలో వసీం అక్రమ్, సొహైల్ తన్వీర్.. వంటి కొందరికి అవకాశాలిచ్చినా ఆ తర్వాత మాత్రం పాక్ ఆటగాళ్లకు నో ఎంట్రీ బోర్డు పెట్టింది బీసీసీఐ. అలాంటిది ఇప్పుడు సన్‌రైజర్స్ జట్టులో దాయాది మిస్టరీ స్పిన్నర్‌కు చోటు దక్కింది. గురువారం జరిగిన ది హండ్రెడ్ వేలంలో అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ భారీ ధరకు కొన్నది.వేలంలో అబ్రార్‌ను లక్షా తొంభై వేల యూరోలకు ˇ190,000 భారతీయ కరెన్సీలో రూ.2.34 కోట్లకు



దక్కించుకుంది. భారత్‌పై అక్కసు వెళ్లగక్కే అబ్రార్‌ను సన్‌రైజర్స్ జెర్సీల చూడాల్సి రావడం కొందరికి నచ్చడం లేదు. అందుకే.. సోషల్ మీడియా వేదికా కావ్య మారన్‌ను, ఆరెంజ్ ఆర్మీ టీమ్‌ను ట్రోల్స్ చేస్తున్నారు.ఇదే అంశంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ను సంప్రదించగా 'మాకేం తెలియదు' అని బదులిచ్చాడు. 'ది హండ్రెడ్ లీగ్ అనేది భారత బోర్డు నిర్వహించే లీగ్ కాదు. విదేశీ ఆటగాళ్లకు సంబంధించిన లీగ్ అది. సో.. ఫ్రాంచైజీలు ఏ ఆటగాడినైనా కొనుక్కునేందుకు అవకాశముంది. ఈ విషయంలో మేము ఏం చేయలేం. చెప్పాలంటే మా చేతుల్లో ఏమీ లేదు' అని శుక్లా సమాధానమిచ్చాడు.ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ విదేశీ లీగ్స్‌లో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ వేదికగా జరిగే ది హండ్రెడ్ లీగ్‌లోనూ ఇటీవలే ఆరెంజ్ ఆర్మీకి ఒక జట్టును కొన్నది. ఆ టీమ్ పేరు సన్‌రైజర్స్ లీడ్స్. తాజా వేలంలోపాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను కావ్య మారన్ బృందం కొన్నది. తనను కొనుగోలు చేయడం పట్ల అబ్రార్ సంతోషం వ్యక్తం చేశాడు. 'నన్ను తీసుకున్నందుకు సన్‌రైజర్స్ లీడ్స్‌కు ధన్యవాదాలు. నాపై నమ్మకం ఉంచినందుకు కావ్య మారన్‌కు కృతజ్ఞతలు. సన్‌రైజర్స్ జట్టు ఈ ఏడాది ది హండ్రెడ్ ట్రోఫీ గెలవడంలో నా వంతు పాత్ర పోషిస్తాను' అని అబ్రార్ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు.

## రవీంద్ర జడేజా రాయల్ వెల్కమ్:

### 'ధురంధర్' సీన్‌ను రీక్రియేట్ చేసిన స్టార్ ఆల్‌రౌండర్!

మరికొన్ని రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19 వ సీజన్ ప్రారంభం కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ 2026 సీజన్ కోసం రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరిన స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు జైపూర్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జడేజా తనదైన శైలిలో సందడి చేస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటించిన 'ధురంధర్' చిత్రంలోని ఒక వైరల్ సీన్‌ను జడేజా అద్భుతంగా రీక్రియేట్ చేశారు. రాజస్థానీ సంప్రదాయ పద్ధతిలో 'ఖమ్మా





ఘని (అందరికి నమస్కారం), రాజస్థాన్!' అంటూ ఆయన పలకడం చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. చెన్నై సూపర్ కింగ్స్‌కు కీలక ఆటగాడిగా ఉన్న జడేజా, ఇప్పుడు మళ్లీ రాజస్థాన్ రాయల్స్ జేర్సీలో తన ప్రయాణాన్ని ప్రారంభించబోతుండటంతో క్రికెట్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ వెల్కమ్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారగా, "జడ్డూ వచ్చేసాడు" అంటూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.

# స్పోర్ట్స్

## భారత్‌లో క్రికెట్ ఒక భావోద్వేగం.. వరల్డ్‌కప్ విజయం మీ అందరిది..!




టీ20 సంచలనంగా భారత జట్టులో పాతుకుపోయిన సూర్యకుమార్ యాదవ్ సారథిగానూ హిట్టయ్యాడు. పొట్టి క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా మార్చిన సూర్య.. సొంతగడ్డపై భారత్‌కు పొట్టి ప్రపంచకప్ అందించిన తొలి కెప్టెన్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత మైదానంలో భారత ఆటగాళ్లు కొందరు తమ ప్రియురాళ్లతో సంబురాలు చేసుకోవడంపై దుమారం రేగుతున్న వేళ.. ఈ విజయంలో అభిమానులకూ భాగముందని చెబుతున్నాడు సూర్య.నరేంద్ర మోడీ స్టేడియంలో మార్చి 8న న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత జట్టు వరుసగా రెండోసారి పొట్టి కప్‌ను ఒడిసిపట్టింది. మరే ఆతిథ్య జట్టుకు సాధ్యమవ్వని విధంగా.. సొంతగడ్డపై పొట్టి వరల్డ్‌కప్‌ను పట్టేసింది. సారథిగా దేశానికి వరల్డ్‌కప్ అందించిన సూర్యకుమార్ యాదవ్ దిగ్గజాల సరసన చేరాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ట్రోఫీని నిలబెట్టుకున్న మొదటి జట్టుగా టీమిండియా గుర్తింపు సాధించడంలో కీలకమైన ఈ మిస్టర్ 360 ప్లేయర్.. వరల్డ్‌కప్ విజయం అందరిదీ అంటున్నాడు.'ప్రియమైన భారత జట్టు అభిమానులరా.. మొదటగా మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ మద్దతు, ఆశీర్వాదం వల్లనే మేము ఇక్కడ ఉన్నాం. ఈ వరల్డ్‌కప్ ట్రోఫీ యావత్ దేశానికి చెందుతుంది. మేము గెలిచినా.. ఇది మా ఒక్కరి విజయమే కాదు. వరల్డ్‌కప్ గెలవాలనేది మనదేశంలో బ్యాట్ పట్టుకున్న ప్రతి చిన్నారి కల. స్టేడియానికి భారీగా తరలివచ్చే అభిమానులకు ఈ ట్రోఫీ చెందుతుంది.ఇంటివద్ద నుంచి మాకు మద్దతు తెలిపిన లక్షలాదిమందికి ఈ ట్రోఫీ విజయంలో భాగముంది. మీ ప్రార్థనలు, అంతులేని ప్రేమ మాకు వరల్డ్‌కప్ ట్రోఫీని గెలిచేందుకు అవసరమైన బలాన్నిచ్చాయి. భారత్‌లో క్రికెట్ కేవలం ఆటే కాదు. అది ఒక భావోద్వేగం. అందుకే.. ఈ విజయం మీ అందరిది' అని సూర్యకుమార్ భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టాడు.







# డాల్బీ సినిమాస్ ఫార్మేట్‌లో పెద్ది విడుదల

తెలుగులో అగ్ర తారల సినిమాలు అత్యాధునిక సాంకేతిక హంగులతో రూపొందుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతుండడంతో అందుకు తగ్గ ప్రమాణాలు తమ సినిమాల్లో కనిపించేలా జాగ్రత్తలు తీసుకొంటున్నాయి నిర్మాణ సంస్థలు. రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రాన్నీ డాల్బీ సినిమాస్ ఫార్మేట్‌లో విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. ప్రత్యేకమైన కథా నేపథ్యం, భారీస్థాయి యాక్షన్ అంశాలు, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న ఈ సినిమా డాల్బీ ఫార్మేట్‌లో ప్రేక్షకులకు మరింత ఘనమైన, ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు చెప్పాయి. ఈ ఏడాది భారీస్థాయి అంచనాల మధ్య రూపొందుతున్న సినిమాల్లో 'పెద్ది' ఒకటి. ఏప్రిల్ 30న విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకుడు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

# ఓటిటిలోకి బార్డర్-2

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన భారీ యుద్ధ చిత్రం 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లను సాధించి ప్రస్తుతం ఓటీటీ విడుదలకు సిద్ధమవుతోంది. 1997లో వచ్చిన క్లాసిక్ వార్ డ్రామా 'బోర్డర్'కు సీక్వెల్‌గా, అనురాగ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జనవరి 23న థియేటర్లలో విడుదలై సుమారు రూ. 480 కోట్లకు పైగా వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ భారీ విజయం తర్వాత, ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ప్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం మార్చి 20 నుంచి నెట్‌ప్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 1971 భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి కీలక పాత్రల్లో నటించి మెప్పించారు.





# నాలుగేళ వివాహ బంధానికి చెల్లుచీటి

## ఆశను కోల్పోకుండా ముందుకు సాగాల్సిందే : హన్సిక

నటి హన్సిక తన భర్త నుంచి విడాకులు తీసుకుని,. నాలుగేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు విడాకుల అనంతరం ఆమె తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబీ పదం 'చార్ది కలా..' అని రాశారు. ఎప్పుడూ ఉత్సాహంతో ముందుకుసాగాలని.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశను కోల్పోవద్దని దీని అర్థం. 2022 డిసెంబర్‌లో సోహైల్-హన్సిక వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో ఆమె సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో విడాకుల రూమర్స్ మొదలయ్యాయి. మార్చి 11న వీరికి కోర్టు విడాకులు మంజూరుచేసింది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన అందం, నటనతో అలరించిన ప్రముఖ నటి హన్సిక మోత్వాని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్త నెట్టింట ఎంతగా వైరల్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోహైల్ కతూరియాని ప్రేమించి పెళ్లి చేసుకున్న హన్సిక అతనికి విడాకులు ఇచ్చినట్టు జోరుగా ప్రచారం సాగింది. కొంతకాలంగా ఈ జంట మధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుండగా, ముంబైలోని బాంద్రా కోర్టు వీరి విడాకులను ఖరారు చేసిందని కొన్ని మీడియా వర్గాల్లో వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. అయితే తాజాగా హన్సిక తన సోషల్ మీడియాలో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. చర్ది కాలా ఆల్వేస్ అనే పంజాబీ కొటేషన్ షేర్ చేయగా, దాని అర్థం ఏంటంటే.. ఎలాంటి కష్టాలలో ఉన్నా కూడా పాజిటివ్‌గా, ధైర్యంగా ఉండాలని దీని అర్థం.అంటే తన జీవితంలో మరో కొత్త అధ్యాయం ప్రారంభించడానికి తాను సిద్ధంగా ఉన్నానని హన్సిక ఇన్‌డైరెక్ట్ కామెంట్ పెట్టి ఉంటుందని నెటిజన్స్ భావిస్తున్నారు. ఇక హన్సిక మోత్వానీ, వ్యాపారవేత్త సోహైల్ కతూరియా 2022 డిసెంబర్ 4న రాజస్థాన్‌లోని జైపూర్‌లో అట్టహాసంగా జరగగా, ఈ పెళ్లి వేడుక ఎంతో గ్రాండ్‌గా జరిగి అప్పట్లో సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. పెళ్లి తర్వాత కొంతకాలం వరకు ఈ జంట సంతోషంగా జీవిస్తున్నట్లు కనిపించింది. అయితే పెళ్లి అనంతరం కొన్ని నెలలకే వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయని సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా హన్సిక తన భర్తకు దూరంగా ఉంటూ తల్లితో కలిసి నివసిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి భర్తతో కలిసి ఉన్న పెళ్లి ఫోటోలను తొలగించడం కూడా ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది.

# ఓటిటిలోకి రవితేజ భర్త మహాశయుకలు విజ్ఞప్తి




మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు' చివరకు ఓటిటిలోకి వచ్చేసింది. దర్శకుడు కిషోర్ తిరుమల రూపొందించిన ఈ సినిమాలో హీరోయిన్లుగా ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి నటించారు. ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మంచి స్పందనను అందుకుంది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డీసెంట్ కలెక్షన్స్ సాధించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రవితేజ స్టైల్ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉండటంతో ప్రేక్షకులు సినిమాను బాగా ఆదరించారు. మాస్ మహారాజా గత కొన్ని సినిమాలతో పోలిస్తే ఈ సినిమా థియేటర్లలో మంచి రన్‌ను నమోదు చేసింది. అయితే థియేటర్లలో విడుదలైన తర్వాత ఈ సినిమా ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టింది. ఇతర సినిమాలు తక్కువ సమయంలోనే ఓటిటిలోకి వస్తున్న నేపథ్యంలో 'భర్త మహాశయులకు' మాత్రం ఆలస్యంగా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇక తాజాగా ఈ సినిమా ఓటిటి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటిటి ప్లాట్‌ఫార్మ్ జిఇఇ5 సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని తెలుగు మాత్రమే కాకుండా తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ప్రేక్షకులకు అందుబాటులో ఉంచారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా కయాదు లోహర్ హీరోయిన్ గా దర్శకుడు అనుదీప్ కే వి తెరకెక్కించిన ఫన్ డ్రామా చిత్రమే 'ఫంకీ' థియేటర్స్ లో ఒక డిజప్పాయింట్ చేయగా, ఈ మూవీ ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ చిత్రాన్ని పాపులర్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఈ సినిమా నేటి నుంచి అందుబాటులోకి వచ్చింది. అనుదీప్ గత సినిమా ప్రిన్స్ కూడా థియేటర్స్ తర్వాత ఓటీటీ లోకి వచ్చాక ఓ వర్గం ఆడియెన్స్ ని ఫ్యాన్స్ చేసుకుంది. మరి అలానే ఫంకీ కి కూడా జరుగుతుందా లేదా అనేది వేచి చూడాలి.

# అదే నా లైఫ్ యాంబిషన్

'అల్లు అర్జున్‌తో కలిసి నటించడం నా డ్రీమ్. ఆయనతో చిన్న రోల్ అయినా చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు' అంటున్నది ఢిల్లీ భామ రితికా నాయక్. 'అశోకవనంలో అర్జున కల్యాణం' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారి, 'మిరాయి'తో స్టార్ ఇమేజ్‌ని సొంతం చేసుకుంది.ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ 'డ్యూయెట్'లోనూ, వరుణ్‌తేజ్ 'కొరియన్ కనకరాజు' చిత్రంలోనూ నటిస్తూ బిజీగా ఉన్నది రితికా నాయక్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'సినిమాల్లోకి రావాలని నేనెన్నడూ అనుకోలేదు. ఢిల్లీలోనే నా హయ్యర్ ఎడ్యుకేషన్ పూర్తయింది. ఏదైనా జాబ్ చూసుకుందాం అనుకున్నా. కానీ ఫ్రెండ్స్ బలవంతం పెట్టడంతో తప్పక 'ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్' 12 సీజన్‌లో పాల్గొన్నా. ఊహించని విధంగా ఆ కాంటెస్ట్‌లో విజేతగా నిలిచా. అక్కడ్నుంచి నా ఆలోచనా విధానమే మారిపోయింది. ఎవరు ఆడిషన్స్‌కి పిలిచినా వెళ్లేదాన్ని. చివరికి 'అశోకవనంలో అర్జున కల్యాణం'తో హీరోయిన్‌గా మారాను. తొలి సినిమాకే బెస్ట్ డెబ్యూగా సైమా అవార్డు రావడంతో చెప్పలేనంత ఆనందం అనిపించింది. ఇక 'మిరాయి' నిజంగా నా లైఫ్‌లో ఓ మిరాకిలే. ఈ సినిమా పుణ్యమా అని హిందీ ఆఫర్లు కూడా వస్తున్నాయి. ఏదేమైనా నా లైఫ్ యాంబిషన్ మాత్రం ఒకటే.. బన్నీతో కలిసి నటించాలి' అని అందం గా నవ్వేసింది రితికా నాయక్.




Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831